క్లుప్తంగా

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈవో

తాండూర్: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న సేవలను వారు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ప్రభాకర్ సూచించారు. 18సంవత్సరాల లోపు దివ్యాంగ పిల్లలకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ భవిత కేంద్రంలో అన్ని రకాల సేవలు అందించబడతాయని, ప్రతీ బుధవారం ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకటేష్ అందుబాటులో ఉండి నాడీ వ్యవస్థ, ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారికి సేవలు అందిస్తారన్నారు. ఈ సేవలను తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐబీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఐఈఆర్పీ ఎస్ వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ భీమిని శారద, ఎంపీటీసీ తుమ్మల లావణ్య తెలిపారు. కార్యదర్శి ప్రోటోకాల్ పాటించడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం క్రీడాకారులకు క్రీడా కిట్లను పంపిణీ చేయగా, ఇప్పటి వరకు కిట్లను పంపిణీ చేయలేదని, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే క్రీడాకారులకు బుధవారం కిట్లను పంపిణీ చేసిందన్నారు. ఈ విషయమై ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

దండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా దండేపల్లి మండలంలో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన పనులకు సంబంధించి 13వ విడత సామాజిక తనిఖీలో చేపట్టిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని నీల్వాయిలో ఎంపీపీ స్వర్ణలత, చామనపల్లిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషంలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, సీఈఓ మధుకర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

భీమారం: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి సురక్ష యోజన ద్వారా బీమా తీసుకోవాలని భీమారం ఎస్‌బీఐ మేనేజర్ ప్రతీక్ ప్రజలను కోరారు. ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం మండలంలోని నర్సింగాపూర్‌లో అవగాహన కల్పించారు. సంపాదించే దాంట్లో కొంతైనా పొదుపు చేయాలని కోరారు.

భూ కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

వేమనపల్లి: 80ఏళ్లుగా ఇళ్లు కట్టుకొని ఉంటున్న భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని దస్నాపూర్ గ్రామానికి చెందిన పున్న పోశక్క డెప్యూటీ తహసీల్దార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. నేను, నా భర్త పోశయ్య గ్రామంలో చాకలి వృత్తి చేసుకుంటూ జీవిస్తూ 80ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమి సర్వే నం.46లో 12గుంటల పెరటిలో ఇళ్లు నిర్మించుకొని సాగు చేసుకుంటున్నాను. నా భర్త పోశం 20సంవత్సరాల క్రితం మృతి చెందగా కుమార్తె సుశీల, పిల్లలతో కలిసి ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఇటీవల గొర్లపల్లి గ్రామానికి చెందిన అరిగెల శంకర్‌గౌడ్, అతడి భార్య సత్తమ్మ తనను బెదిరించి అక్రమంగా స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని పేర్కొంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరింది.

నేత్రదానం చేసి.. ఆదర్శంగా నిలిచి

జైపూర్: మండలంలోని బెజ్జాల గ్రామానికి చెందిన శనిగారపు బానేష్, లక్ష్మీ దంపతుల కుమారుడు సాయికుమార్ (18) బుధవారం ఉదయం కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో సాయికుమార్ కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ఆసుపత్రికి వారి తల్లిదండ్రులు దానం చేసి మానవత్వం చాటుకున్నారు.

మెడికల్ పరీక్ష నిర్వహించేలా చూడండి

- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావుకు కానిస్టేబుల్ అభ్యర్థుల వినతి



ప్రేమ్‌సాగర్‌రావుతో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నిలిచిపోయిన మెడికల్ పరీక్షలను తక్షణమే నిర్వహించి, త్వరితగతిన శిక్షణకు పంపించేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు కోరారు. మంచిర్యాల ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వారి డిమాండ్లను వివరించారు. 2022లో జారీ చేసిన పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ప్రాథమిక రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్ష, తుది రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఉద్యోగాలకు ఎంపికైన వారికి మెడికల్ పరీక్షలను నిర్వహించే సమయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో అర్ధంతరంగా నిలిచిపోయిందని తెలిపారు. వెంటనే ఆ సమస్యను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తలసేమియా వ్యాధిగ్రస్తుల సమస్యలపై వినతి

తలసేమియా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును కలిసి తలసేమియా వ్యాధిగ్రస్తుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు వ్యాధి పూర్తిగా నయం అయ్యేందుకు బోన్ మారో మార్పిడికి అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా బోన్ మారో మార్పిడి వైద్యం చేయించి, ఉచితంగా మందులు అందించేలా చూడాలని కోరారు. ప్రతి నెలా ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15వేల ప్యాకేజీని రూ.30వేలకు పెంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ చందూరి మహేందర్, సభ్యులు వి.మధుసూదన్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి, ఎస్.నాగేందర్, ఎడ్ల కిషన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును పలు సంఘాల సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. మంచిర్యాలలోని ఎమ్మెల్యే నివాసంలో దస్తావేజు లేఖరుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దీపక్ ఉపాధ్యాయ, ఉపాధ్యక్షుడు గోనె రాజు, కార్యదర్శి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ పి.వెంకటేష్, కోశాధికారి వి.శ్రీనాథ్, జక్కుల రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బాడీ బిల్డర్స్ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాగుల శ్రీనివాస్, ఎండీ ఆరిఫ్, వెంకటేశ్వర్లు, సయ్యద్ రఫీక్, తిరుపతి, నవీన్, శశి, అశోక్, వీరితో పాటు 60మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జేసీఐ సభ్యులు

శ్రీరాంపూర్: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ మంచిర్యాల శాఖ సభ్యులు బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ మంచిర్యాల అధ్యక్షుడు ఆర్మూల్ల రాజు, సెక్రటరీ గన్‌రాజు, ట్రెజరర్ వెంకటేష్, మహేష్ సురేందర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలి



నెన్నెలలో వీధులను పరిశీలిస్తున్న డీపీఓ

నెన్నెల: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని డీపీఓ వెంకటేశ్వర్లు పంచాయతీ సిబ్బందికి సూచించారు. నెన్నెల పంచాయతీలలో బుధవారం పలు వీధులను పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడిక తీయాలని, గ్రామాల్లో చెత్తచెదారం లేకుండా వీధులను పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ తోట సుజాత, ఎంపీఓ శ్రీనివాస్‌లకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి ట్రాక్టర్‌లో వేసి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. సేకరించిన చెత్తను ఎరువుల తయారీకి ఉపయోగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచ్ సుజాత, కార్యదర్శి సాగర్ ఉన్నారు.

బెల్ట్‌షాపు మూసివేత

సాక్షి ఎఫెక్ట్..



ముత్యంపేటలో మూసివేసిన బెల్ట్ షాపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో ఎక్సైజ్ శాఖా గెజిట్ నంబర్ 26 మేరకు ఏర్పాటు చేసిన మద్యం దుకాణ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించి ఏకంగా జాతీయ రహదారిపై బెల్ట్‌షాపు ఏర్పాటు చేశారు. బెల్ట్‌షాపు నిర్వహణపై 'నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపు నిర్వహణ' అనే శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బెల్ట్‌షాపును మూసివేయించి నిర్వాహకులను హెచ్చరించారు. మద్యం దుకాణ నిర్వాహకులే ఇలా బెల్ట్‌షాపు నిర్వహించడంపై స్థానికంగా విమర్శలకు దారితీయగా బెల్ట్‌షాపు మూసివేతకు సహకరించిన 'సాక్షి' పత్రికకు అభినందనలు తెలిపారు.

బస్సులు నడపాలని ఆర్టీసీ ఎండీకి ట్వీట్

భీమారం: మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి భీమారం మండలంలోని పలుగ్రామాలకు బస్సులు నడపాలని కొత్తపల్లి గ్రామానికి చెందిన కలగూర చంద్రశేఖర్ బుధవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కి ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం ఏర్పాటు చేసినా, మండలంలోని ఆరెపల్లి, మద్దికల్, కొత్తపల్లి గ్రామాలకు ఆర్టీసీ సేవలు లేక మహిళలు సదుపాయం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. కొత్తపల్లి నుంచి చెన్నూరు మండలం ఎర్రగుంటపల్లి వరకు బస్సులు నడపాలని కోరారు.

అంబులెన్స్ కోసం ఎమ్మెల్యేకు వినతి



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వివేక్, తదితరులు

భీమారం: మండల కేంద్రమైన భీమారంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లేదని కనీసం అంబులెన్స్‌ని ఏర్పాటు చేయాలని స్థానిక యువకులు బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంగా ఏర్పడి దాదాపు 9సంవత్సరాలు దాటుతున్నా, మండల ప్రజలు వైద్యసేవలకు పొరుగుమండలాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. యువకులు కొక్కుల నరేష్, ఆవిడపు రవితేజ, సందనవేని అజయ్, బానేష్, రమేశ్ ఉన్నారు.

25మందికి చెక్కులు పంపిణీ

మండలంలోని 25మందికి కళ్యాణలక్ష్మితో పాటు షాదీ ముబారక్ కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కలెక్టర్ సంతోష్, తహసీల్దార్ విశ్వంబర్ ఉన్నారు.

రేణుకాదేవి విగ్రహ ప్రతిష్ఠ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయంలో రేణుకాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బుధవారం చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు మూల రాజిరెడ్డి, నాయకులు గజ్జెల అంకాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌ను సన్మానించిన టీఎన్‌జీవో నాయకులు

చెన్నూర్: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని మంచిర్యాల జిల్లా టీఎన్‌జీవో కార్యవర్గం బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి భూముల రాంమోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, మంచిర్యాల, చెన్నూర్ పట్టణ అధ్యక్షులు నాగుల గోపాల్, మామిడి రాజన్న, కోశాధికారి కరీం, ఉపాధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

పరామర్శ

పట్టణంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన బొంతల సందీప్ అనే కాంగ్రెస్ కార్యకర్తపై బీఆర్ఎస్ కౌన్సిలర్ తుమ్మ రమేశ్ దాడి చేశాడు. ఈ దాడిలో సందీప్‌కు గాయాలయ్యాయి. బుధవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సందీప్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన



విద్యార్థులతో షీ టీమ్ పోలీసులు

మంచిర్యాలక్రైం: విద్యార్థులు షీ టీమ్‌పై అవగాహన కలిగి ఉండాలని షీ టీమ్ ఎస్సై హైమా అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో బుధవారం షీ టీమ్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ షీ టీమ్ పోలీసులను ఏర్పాటు చేసిందన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు భద్రత కోసం షీ టీమ్ పోలీసులు అండగా ఉంటూ రక్షణ కల్పిస్తారని తెలిపారు. మహిళలను, విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులను ఎవరైనా ప్రేమపేరుతో వేధించడం, మహిళలతో అసభ్యకరంగా వ్యవహరించడం, తరుచుగా సెల్‌ఫోన్ ద్వారా అశ్లీల దృశ్యాలు, ఎస్ఎమ్మెస్‌లు పంపించడం చేస్తూ.. వేదింపులకు పాల్పడినవారి ఆటకట్టించేందుకు షీ టీమ్ 24/7పని చేస్తుందని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చేందుకు భయపడుతున్న వారు 100డైల్‌కు కాల్ చేసి సమాచారం అందించిన ట్లెతై షీ టీమ్ పోలీసులు మఫ్టిలో ఉంటూ వెంబడించి పట్టుకుంటారన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్సై ఓబులమ్మ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులు ప్రారంభించాలని వినతి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి పీజీ కోర్సులను మంజూరు చేసి అమలు చేయాలని డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. బెల్లంపల్లిలో కేవలం డిగ్రీ కళాశాల మాత్రమే ఉందన్నారు. డిగ్రీ తర్వాత పీజీ చదవడానికి స్థానికంగా అవకాశాలు లేక అనేకమంది పేద విద్యార్థులు ఆర్థిక స్తోమత లేక అర్ధంతరంగా చదువు మాని వేయడమో లేదా వ్యయప్రయాసల కోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడమో చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 2024–25 విద్యాసంవత్సరంలో పీజీ కోర్సులను మంజూరు చేసి డిగ్రీ కళాశాలలో బోధన తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, సాయి, వంశీ, అనిల్, శబీజాయ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు తాకట్టు పెట్టిన సంఘాలకు బుద్ధి చెప్పాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

శ్రీరాంపూర్: కార్మికుల హక్కులను యాజమాన్యానికి తాకట్టు పెట్టిన కార్మిక సంఘాలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆర్కే 6గనిపై బుధవారం ఆయన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో రాజీలేని పోరాటాలు చేసిన చరిత్ర విప్లవ కార్మిక సంఘాలకే ఉందని కావున ఈ ఎన్నికల్లో విప్లవ కార్మికసంఘాల కూటమిని ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తమతోపాటు మరో ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయన్నారు. కార్మికులు ఆదరించి గెలిపించాలన్నారు. సింగరేణిలో కార్మికులు నేడు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇన్నాళ్లు గుర్తింపు సంఘాలేవి వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. విప్లవకార్మిక సంఘాల కూటమి గెలిస్తేనే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, ఎస్‌జీఎల్‌కేబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోషమల్లుతోపాటు నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, మేకల రామన్న, బ్రహ్మానందం, గజ్జి మల్లేష్, నాగరాజు, సారయ్య పాల్గొన్నారు.

డిస్మిస్ కార్మికులకు అవకాశం ఇవ్వండి

- 7135 రోజులుగా కొనసాగుతున్న దీక్ష



దీక్షలో పాల్గొన్న డిస్మిస్ కార్మికులు

మందమర్రిరూరల్: సింగరేణిలో డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశం కల్పించాలని ఏరియా జీఎం ఆఫీస్ సమీపంలో చేస్తున్న దీక్ష బుధవారం నాటికి 7135వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. డిస్మిస్ అయిన కార్మికులు జీవనోపాధి లేక ఆకలి చావులు చచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా, డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చిందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరువ తీసుకుని ఒక్కసారి డిస్మిస్ కార్మికులందరికీ ఉద్యోగావకాశం ఇవ్వాలని కోరారు. దీక్షలో శ్రీనివాస్, రుద్రయ్య పోసమ్మ, పాగిడి రాములు ఉన్నారు.

సింగరేణి ఆవిర్భావ వేడుకలపై సమీక్ష



అధికారులకు సూచనలు ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ఈ నెల 23న ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో అధికారులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలు పోటీలు ఉంటాయని, స్టాల్స్ ఏర్పాట్లు ఉంటాయని పోటీల్లో పాల్గొనాలనే వారితో పాటు స్టాల్స్ ఏర్పాటు చేసేవారు ఏరియా జీఎం ఆఫీస్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు. అంతకుముందు కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన వెంకటస్వామిని శాలువా కప్పి సన్మానించారు.

'టీబీజీకేఎస్‌ను ఆదరించాలి'

తాండూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను ఆదరించి గెలిపించాలని ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్‌లో బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ యూనియన్ ఎల్లప్పుడూ కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికై, హక్కుల సాధనకై పాటుపడిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిలో కార్మికులకు ఎన్నో హక్కులు సాధించామని, కోల్ ఇండియాలో లేని హక్కులు సైతం నెరవేర్చిన ఘనత టీబీజీకేఎస్‌ది అన్నారు. బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకెఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు ప్రకాష్ రావు, మంగీలాల్, నాయకులు సదాశివ్, రాజేశం, తిరుపతి, చంద్రయ్య పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కొనసాగుతున్న క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న రాధాకుమారి

శ్రీరాంపూర్: ఈ నెల 23న జరిగే సింగరేణి డేను పురస్కరించుకొని బుధవారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి పాల్గొని ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. టగ్‌ఆఫ్ వార్, బాంబ్ బ్లాస్ట్ త్రోబాల్ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీలో చేరిక



అశోక్‌కు కండువా కప్పుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌కు రాజీనామా చేసి డెప్యూటీ జనరల్ సెక్రెటరీ చాట్ల అశోక్ బుధవారం ఐఎన్టీయూసీలో చేరారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఆ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో జనక్‌ప్రసాద్ సమక్షంలో చేరారు. అశోక్‌కు జనక్‌ప్రసాద్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. యూనియన్‌లో ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని జనక్‌ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యామ్, నాయకులు భీంరావు, మోతే రాఘవరెడ్డి, రమేష్, మల్లారెడ్డి, సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గని, సింగరేణి ఏరియా ఆసుపత్రిలో బుధవారం సింగరేణి కాలరీస్ కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ) నాయకులు గుర్తింపు ఎన్నికల ప్రచారం చేశారు. గుర్తింపు ఎన్నికల్లో ఈసారి ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కార్మికులను కోరారు. కార్మిక హక్కులను కాపాడతామని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఐఎన్‌టీయూసీలో చేరారు. ప్రచార కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు రాజమొగిలి, సమ్మయ్య, భూమయ్య, ఓదెలు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అయ్యప్ప పడిపూజ



తాండూర్: మండలంలోని సురభి గోధాక్షేత్ర గార్డెన్స్‌లో మంగళవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. రెబ్బెనకు చెందిన గురుస్వామి కిరణ్‌శర్మ 18వ సారి శబరియాత్రను పురస్కరించుకుని నిర్వహించిన ఈ పడిపూజ కార్యక్రమానికి ఆదిలాబాద్‌కు చెందిన తాంత్రి సాయికృష్ణ దుబే గురుస్వామి హాజరై పూజా కార్యక్రమాలు చేపట్టారు. పడిపూజకు ఆసిఫాబాద్, రెబ్బెన, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, తాండూర్ నుంచి దాదాపు 300మంది అయ్యప్ప స్వామి మాలదారులు హాజరయ్యారు. ఈ పూజా కార్యక్రమం ప్రత్యేక పూజలతో, భజనలతో శోభాయమానంగా కొనసాగింది.

ఎమ్మెల్యే బొజ్జును కలిసిన తహసీల్దార్



జన్నారం: ఖానాపూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును బుధవారం తహసీల్దార్ వేణుగోపాల్ ఉట్నూర్‌లోని తన నివాసంలో మొదటిసారిగా మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మండల సమస్యలు, స్థితిగతుల గురించి చర్చించినట్లు ఆయన తెలిపారు.